క్లుప్తంగా

శ్మశాన భూముల పరిశీలన



శ్మశాన భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలసలో ఆక్రమణలో ఉన్న శ్మశాన భూములను రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు గురువారం పరిశీలించారు. సర్వే నంబర్ 32-11, 41-1,16-3లో గల భూముల్లో ఆక్రమణలు జరిగాయని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వీఆర్‌ఓ అట్టాడ రాము నాయుడు, ప్రజాప్రతినిధి వందనాల అప్పలరాజు తెలిపారు.

అభివృద్ధి పనులపై ఆరా



వార్డు పర్యటనలో పాల్గొన్న సహాయ కమిషనర్ తిరుమలరావు, తదితరులు

విజయనగరం రూరల్: నగరంలోని 22వ డివిజన్ పరిధిలో బొడ్డువారి కూడలి నుంచి మరిడమ్మ ఆలయం వరకు సాధారణ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని కార్పొరేషన్ సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు అన్నారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం ఆయన 22వ డివిజన్‌లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌కు సంబంధించి ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బవిరెడ్డి సతీష్, టీపీఓ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రొంగలి పోతన్న ఆదర్శప్రాయుడు



రొంగలి పోతన్నను అభినందిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం టౌన్: గ్రంథాలయ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న నిరాడంబర శైలి ఆదర్శనీయమని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు గురువారం తన క్యాంప్ కార్యాలయంలో పోతన్నను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 'రిక్షావాలా నుంచి గ్రంథాలయ చైర్మన్ వరకూ' పుస్తకాన్ని పోతన్న కమిషన్ చైర్మన్ శంకరరావుకు అందజేశారు.

రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు

విజయనగరం క్రైమ్: రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టామని విజయనగరం రూరల్ సీఐ బి.లక్ష్మణరావు అన్నారు. గంట్యాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొండపల్లి రహదారిపై రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను గురువారం తొలగించారు. కార్యక్రమంలో గంట్యాడ ఎస్సై సాయికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

నెల్లిమర్ల: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ తెలిపారు. నెల్లిమర్ల పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రెండు సీసీ కెమెరాలను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల కారకులను గుర్తించడానికి, దొంగతనాలు, ఇతర నేరాలను నిరోధించడానికి సీసీ కెమెరాలు దోహదపడతాయని చెప్పారు. దాతల సహకారంతో నియోజకవర్గంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై బి. గణేష్ పాల్గొన్నారు.

నేడు క్షేత్ర సహాయకులకు శిక్షణ

విజయనగరం ఫోర్ట్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై జిల్లాలోని క్షేత్ర సహాయకులకు శుక్రవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డ్వామా పీడీ ఎస్.శారదాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఉపాధి హామీ పథకం రాష్ట్ర సంచాలకుడు వైవీకే షణ్ముఖకుమార్, కన్వర్జెన్స్ జాయింట్ కమిషనర్ జె.సునీత, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు. తెలిపారు.

● పర్యవేక్షణ..



విజయనగరంలో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య అన్నారు. కార్మికులు చేపడుతున్న పనులను గురువారం తెల్లవారుజామున ఆయన పర్యవేక్షించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయనతో పాటు కార్పొరేషన్ సిబ్బంది ఉన్నారు. - విజయనగరం రూరల్

● వితరణ..



పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో నీలాచలం పర్వతంపై కొలువైన కోదండ రామాలయానికి భగవత్ రామానుజ బృంద సభ్యులు మైక్‌సెట్‌ను గురువారం వితరణగా అందజేశారు. రామ సన్నిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓ వై. శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, పవన్, సిబ్బంది పాల్గొన్నారు. - నెల్లిమర్ల రూరల్

● నివాళి..



జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కేఎల్ పురంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి గురువారం ఘనంగా జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎర్నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, రోటరీ క్లబ్ సెంట్రల్ కార్యదర్శి ఆర్. శంకరరెడ్డి, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. - విజయనగరం అర్బన్

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

● వయోజనవిద్య ఏపీఓ ధనలక్ష్మి



పూసపాటిరేగ: మాట్లాడుతున్న వయోజన విద్య ప్రాజెక్ట్ అధికారి లక్ష్మి, తదితరులు



డెంకాడ: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వయజన విద్య ఏపీఓ ధనలక్ష్మి



పూసపాటిరేగ: మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు



డెంకాడ: కార్యక్రమానికి హాజరైన వలంటీర్ టీచర్లు



నెల్లిమర్ల: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

డెంకాడ: నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వలంటీర్ టీచర్లు ఉన్నత లక్ష్యంతో పని చేయాలని వయోజన విద్య ఏపీఓ ధనలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వలంటీర్ టీచర్లకు రెండో దశ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో సాయంత్రం 5 గంటల నుంచి 7 వరకు నిక్షరాస్యులైన వారిని అక్షరాస్యులుగా మార్చేందుకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భవానీ, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు సూరిబాబు, మంజుశ్రీ , తదితరులు పాల్గొన్నారు.

నిరక్ష్యరాస్యతను నిర్మూలించడమే ధ్యేయం..

పూసపాటిరేగ: నిరక్షరాస్యతను నిర్మూలించడమే ధ్యేయమని వయోజన విద్య ప్రాజెక్ట్ అధికారి లక్ష్మి అన్నారు. భోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. మార్చి నెల నాటికి వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దితే పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆమెతో పాటు సూపరింటెండెంట్ కామేశ్వరరావు, రిసోర్స్‌పర్సన్ వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

పూసపాటిరేగ: ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకునేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్ గురాల ఈశ్వరరావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

శతశాతం అక్షరాస్యత సాధించాలి..

నెల్లిమర్ల: మహిళలు శతశాతం అక్షరాస్యత సాధించాలని ఎంపీడీఓ కె. రామకృష్ణరాజు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు వీఓఏలు, వలంటీర్ టీచర్లకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు విద్యావంతులైనప్పుడే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. వెలుగు ఏపీఎం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌గా తిరుమలరెడ్డి శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు కృష్ణ, శ్రీను, సూరీడమ్మ, విజయ, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు పనిభారం తప్పించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల

విజయనగరం అర్బన్: విద్యారంగ పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని.. యాప్‌ల నిర్వహణ నుంచి ఉపాధ్యాయులను దూరం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజల డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా చేస్తున్న ప్రచారంలో భాగంగా గురువారం ఆమె పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహిచిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లి పరిష్కరించడంలో రఘువర్మ కృషి చేస్తారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బుకారీబాబు, ప్రధాన కార్యదర్శి పాల్తేరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు జోగినాయుడు, రాష్ట్ర కౌన్సిల్ రవి, పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు సంపూర్ణలత, శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ చర్చి మహాసభలకు తరలిరండి

● సీబీసీఎన్‌సీ ట్రస్ట్ చైర్మన్ ఆర్ఎస్ జాన్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఎస్ జాన్

విజయనగరం టౌన్: నగరంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కనున్న సీబీసీఎన్‌సీ చర్చి 70వ ఐక్య మహాసభలకు క్రైస్తవ సోదరులందరూ తరలిరావాల సీబీసీఎన్‌సీ ట్రస్ట్ చైర్మన్ ఆర్ఎస్ జాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం చర్చి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 26వ తేదీ మధ్యాహ్నం వరకు ఉత్తర సర్కారు బాప్టిస్ట్ చర్చిల మహాసభలు జరుగుతాయన్నారు. సోంపేట నుంచి అవనిగడ్డ వరకూ బాప్టిస్ట్ సంఘ రాయబారులు ఈ మహాసభల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డేనీ కృపానంద్, వై.ప్రభాకర్, డీజేపీ సోలోమన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేయర్ల వినియోగంతో ఎన్నో ప్రయోజనాలు



స్ప్రేయర్‌తో పిచికారీ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి టీవీ రామారావు

● జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు

డెంకాడ: పంటలకు చీడపీడలు సోకినపుడు డ్రోన్ స్ప్రేయర్లు వినిగించి మందులు పిచికారీ చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని అక్కివరంలో మొక్కజొన్న పంటకు డ్రోన్ స్ప్రేయర్‌తో గురువారం పురుగు మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ప్రేయర్‌తో మందులు పిచికారీ చేయడం ద్వారా సమయంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. అలాగే పంటపై మందు కూడా సమానంగా పడుతుందని చెప్పారు. సాధారణ యంత్రాలతో చల్లడం వల్ల మనుషులపై పురుగుమందు ప్రభావం ఉంటుందని.. డ్రోన్ వల్ల ఆ ఇబ్బందులుండవన్నారు. మారుతున్న కాలంతో పాటు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, ఏడీఏ ఎ.నాగభూషణం, ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం ఆనంద్, డెంకాడ, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, రైతులు, గ్రామ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవన్‌రాణి

పూసపాటిరేగ: అతిసారపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ జీవన్‌రాణి సూచించారు. భోగాపురం మండలంలోని పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ఇటీవల సోకిన నాలుగు అతిసార కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోగాపురం, భీమిలి ఆస్పత్రుల్లో చికిత్స పొందిన రోగులు ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని సీహెచ్‌ఓ జయకుమారి తెలిపారు. పీహెచ్‌సీకి రోగులు ఎంత మంది వస్తున్నారు.. ఎంత మందికి చికిత్స అందిస్తున్నదీ ఆరా తీశారు. గ్రామాలలో జరుగుతున్న లెప్రసీ సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్ సూరిబాబు, సీనియర్ సహాయకుడు శ్రీనివాస్, తదితరులున్నారు.

జూదరుల అరెస్టు

డెంకాడ: మండలంలోని మోపాడ గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ఈ మేరకు ఎస్సై సన్యాసినాయుడు అందించిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి సమయంలో మోపాడ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 8 మంది పట్టుకుని, వారి నుంచి రూ.లక్షా 27వేల 130 నగదు, 5 సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని చెప్పారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గంట్యాడ: కౌమార బాలికలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధి కారి వెంకటేష్ ఆశ కార్యకర్తలకు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌమార బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్య బారిన పడకుండా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ కొండమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలని నిరసన

వేపాడ: సోంపురం–వేపాడ ప్రధాన రహదారి నుంచి ఆతవ గ్రామానికి వెళ్లే రోడ్డు పునరుద్ధరణ పనులను తక్షణం ప్రారంభించాలని కోరుతూ ఆగ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన ఉద్యమనేత ఆతవ ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కావడంతో పాటు పనులు ప్రారంభమయ్యాయన్నారు.ఎన్నికలకు ముందు మెటల్, క్రషర్ బుగ్గి వేశారని, ఆ తర్వాత పనులు నిలిచిపోయా యని చెప్పారు. రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని ఎన్నికల సమయంలో హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు స్పందిం చి రోడ్డు పనులు ప్రారంభించాలని, లేకుంటే ఈ నెల 27నుంచి ధర్నా చేస్తామని ప్రకటించారు. మాజీ సర్పంచ్ బోను నాగరాజు, దళిత నాయకులు కర్రి దేముడు, డప్పు రాజు, చప్ప నూకరాజు తదితరులు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో తోటపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి. త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ, శ్రీరామ్‌నగర్, గోపాల్‌నగర్, ఇందిరానగర్, నాగోజీపేట, రైల్వేస్టేషన్, బొత్సపేట, సెంట్రల్ బ్యాంక్ ఏరియా, తిరుమల ఆస్పత్రి ఏరియా, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, బాలాజీనగర్, నాయుడు కాలనీ, సాయినగర్, నరసింహనగర్, సిద్ధార్థ నగర్, వీటీ అగ్రహారం, బీసీ కాలనీ, ప్రదీప్‌నగర్, మజ్జిపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవుని నెలివాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దేవుని నెలివాడ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్‌క్లియరెన్స్ చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు రామతీర్థం, సీతారామునిపేట, గొర్లిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ పరిధిలో..

డెంకాడ: మండలంలోని చింతలవలస 5వ ఏపీఎస్పీ బెటాలియన్ పరిధిలోని పలు గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మండలంలోని జొన్నాడ, దువ్వపేట, గొలగానిపేట, ఆకులపేట, డి.తాళ్లవలస గ్రామాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వేరుశనగలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో రస్తాకుంటుబాయి కృషీ విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు గురువారం వేరుశనగ పంటకోత ప్రయోగం నిర్వహించారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఎస్.ధ్రువ మాట్లాడుతూ వేరుశనగలో టీసీజీఎస్ 1694 రకం దిగుబడి ఆశాజనకంగా ఉందని, ఎకరానికి 14 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని చెప్పారు. కేవీకే ద్వారా ఇక్కడి రైతులకు టీసీ జీఎస్ 1694 రకం వేరుశనగ విత్తనాలను సిఫార్సు చేయడం జరిగిందని, ఈ రకంలో దిగుబడి ఎక్కువగా ఉంటుందని, అధిక నూనె శాతం ఉంటుందని, గింజ పరిమాణం కూడా ఒకేలా ఉంటుందని, పురుగు, తెగుళ్ల ఉధృతి తక్కువ అని చెప్పారు. కార్యక్రమంలో సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.స్రవంతి, విస్తరణ విభాగం శాస్త్రవేత్త అనంత విహారి, యంగ్ ప్రొఫెషనల్ అనీల్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పశు వైద్యశిబిరాలు



నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వైవీ రమణ

● జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వైవీ రమణ

నెల్లిమర్ల రూరల్: జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పశు వైద్యశిబిరాలను గ్రామాల్లో పక్కాగా నిర్వహించాలి జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వైవీ రమణ సూచించారు. మండలంలోని సతివాడలో గురువారం నిర్వహించిన పశు వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 31 వరకు కొనసాగే శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జరిగిన శిబిరంలో 32 పాడి పశువులకు టీకాలు వేయడంతో పాటు పెంపకందారులకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 28 ఆవులకు చూడి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.డి చక్రవర్తి, పశు వైద్యాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.